క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని దానవాయి గూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దానవాయిగూడెం వాటర్ వర్క్స్ 11 కేవీ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్–1 అసిస్టెంట్ ఇంజనీర్ మాల్విక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా దానవాయిగూడెం పార్క్ రోడ్, రెయిన్‌బోనగర్, దానవాయిగూడెం సబ్‌జైల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

'కిట్స్' విద్యార్థులకు శిక్షణ

ఖమ్మంరూరల్: మండలంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు క్యాంపస్ టూ కార్పొరేట్ కనెక్ట్ అనే అంశంపై నిర్వహించే రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పన్నాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. క్యాంపస్ సెలక్షన్‌పై అవగాహన కల్పించేందుకే ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ సీనియర్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ మార్క్ లూయిస్ హార్న్ టాస్క్ ద్వారా పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయంలో 'పరీక్షా పే' చర్చ

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లిలో గల కేంద్రియ విద్యాలయంలో శుక్రవారం ఆరో పరీక్షా పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రధాని మోదీ ప్రసంగాన్ని ప్రొజెక్టర్ ద్వారా వినిపించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు తీసుకోవాల్సి మెళకువలను ప్రధాని వివరించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పిండిప్రోలు కళాశాలలో 'బయోమెట్రిక్'

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ కళాశాలలో ఆధార్‌తో అనుసంధానంతో పనిచేసే ఈ–పాస్ మిషన్ ద్వారా బయోమెట్రిక్ హాజరు అమలుకానుంది. ఈ మెషిన్‌ను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుకు టెక్నీషియన్ అనిల్‌కుమార్ అందజేశారు.

నోట్ పుస్తకాల పంపిణీ

కూసుమంచి: నాయకన్‌గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు శుక్రవారం వాసవీక్లబ్ ఆధ్వర్యాన నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసాని సైదులు, వైస్ ఎంపీపీ కంచర్ల పద్మ, ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి బీవీ నర్సింహారావు, బాధ్యులు కందిబండ జయప్రకాష్ వెంకన్న, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నేలకొండపల్లి: మండలంలోని ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు



ప్రశాంతినగర్‌లో మైసమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఆరో డివిజన్ ప్రశాంతినగర్‌లో శ్రీమైసమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి, రస్తోగినగర్‌లో రామాలయ పునఃనిర్మాణానికి శుక్రవారం కార్పొరేటర్ నాగండ్ల కోటి ఆధ్వర్యాన అంగరంగ వైభవంగా శంకుస్థాపనలు చేశారు. ప్రశాంతినగర్ మర్రి చెట్టు వద్ద మైసమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ శంకుస్థాపన చేయగా.. రస్తోగినగర్‌లో రామాలయ పునఃనిర్మాణానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కోటితో పాటు దండా జ్యోతిరెడ్డి, రమేష్, రెడ్డి, కాలనీల్లోని నివాసులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పఠాన్
వినోద	వారసుడు
సాయిరాం	వీరసింహారెడ్డి
ఆదిత్య	పఠాన్
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	హంట్

– ఖమ్మంగాంధీచౌక్

ఇక బినామీల భరతం!

'ఉపాధి'కి ఆధార్ అనుసంధానం

- పారదర్శకత కోసం జాబ్ కార్డుకు లింక్
- ముందుకు రాని కూలీలు..
- అధికారులకు తలనొప్పిగా మారిన వైనం
- రాత్రింబవళ్లు శ్రమిస్తున్న అధికార యంత్రాంగం



మండల పరిషత్ కార్యాలయంలో డేటా ఎంట్రీ చేస్తున్న సిబ్బంది



సింగారెడ్డిపాలెంలో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఈజీఎస్ ఏపీఓ సునీత

నేలకొండపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకతను పెంచేటమే కాక బినామీ కూలీల నమోదును అరికట్టేందుకు అధికారులకు సరికొత్త ఆధునిక సాంకేతిక అందివ్వచ్చుకున్నారు. గతేడాది వరకు సాగిన ఉపాధి హామీ పనుల్లో మరింత పదును చేస్తూ సరికొత్త సాఫ్ట్‌వేర్ రూపొందించటంతో పాటు ప్రతీ కూలీ హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు శ్రీకారం చుట్టారు. కొన్ని గ్రామాల్లో కొందరు కూలీలు పనులకు హాజరు కాకున్నా వేతనం అందించినట్లు గతంలో పలు చోట్ల ఆరోపణలు వచ్చాయి. పాలేరు నియోజకవర్గంలో పలు పంచాయతీల్లో సామాజిక తనిఖీల్లో సిబ్బంది గుర్తించారు. వీటిని అరికట్టేందుకు కూలీల జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసి వారి బ్యాంక్ ఖాతాల్లోనే సొమ్మును జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం అధికారులు క్షేత్రస్థాయిలో సిబ్బంది కూలీలను కలిసి వారి ఆధార్ కార్డులతో అనుసంధానించిన బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్ కార్డుల నంబర్లను సేకరిస్తున్నారు. మరో వారం పది రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇది పూర్తయితే ఇక నుంచి కూలీల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారి వేతనాలను బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నారు.

నేరుగా బ్యాంక్ ఖాతాలోకే..

ఆధార్‌తో జాబ్‌కార్డుల అనుసంధానంతో పని చేసిన కూలీలకే వేతనం అందటమే కాక కూలీల్లో పొదుపు అలవాట్లు అవుతుందని భావిస్తున్నారు. ప్రతీ అవసరాలకు బ్యాంకుకు వెళ్లి డబ్బులు తీసుకునే ఓపిక లేక అనవసర ఖర్చులను వాయిదా వేసి డబ్బు ఆదా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆలోచన చేసింది. ఇక నుంచి తమకు సంబంధించిన వారు ఉపాధి పనులకు రాకున్నా వచ్చినట్లు నమోదు చేయమనే వర్గాల నుంచి ఒత్తిడి ఉండబోదని, క్షేత్ర స్థాయి సిబ్బంది స్వేచ్ఛగా పని చేసే వీలుంటుందన్నారు. అయితే కూలీలు ఇతర పనుల వలన అనుసంధానానికి సహకరించలేకపోతున్నారు. దీంతో టార్గెట్‌ను ఆయా మండలస్థాయి అధికారులు చేరుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో జిల్లా అధికార యంత్రాంగం ఒత్తిడి చేయటంతో చేసేదేమి లేక సెలవు దినాల్లో కూడా మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్, మండల పరిషత్ అధికారులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఇంటింటా తిరిగి ఆధార్‌కార్డులు వసూలు చేసుకుంటున్నారు.

అనుసంధానంపై హర్షం..

పాలేరు నియోజకవర్గంలో దాదాపు 1.20 లక్షల మంది ఉన్న ఉపాధి కూలీలకు యాక్టివ్‌లో ఉన్న 60 వేల మందికి మాత్రమే ఆధార్‌ను అనుసంధానం చేస్తున్నారు. డివిజన్‌లో గతంలో బడాబాబుల సిఫార్సుతో పనికి రాకపోయినా వచ్చినట్లు హాజరు వేసినా గొడవలు జరగొద్దని తామే జోక్యం చేసుకోలేదని కూలీలు పేర్కొంటున్నారు. జాబ్‌కార్డుకు ఆధార్ అను అనుసంధానంతో కూలీ చేసే పనులకు మంచి జరుగుతుందని కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆధార్ అనుసంధానం గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయించాల్సిన అవసరం ఉంది.

గడువులోగా పూర్తి చేస్తాం..



ఉపాధి కూలీల వివరాలు, జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియను గడువులోగా పూర్తి చేస్తాం. కూలీల వద్దకు వెళ్లి నేరుగా మీ బ్యాంక్ ఖాతాలోనే నగదు జమ అవుతాయని వివరిస్తున్నాం. త్వరలోనే నూరు శాతం పూర్తి చేస్తాం. ఆధునిక సాంకేతికతో పనులు పారదర్శకంగా సాగుతున్నాయి.

– కె.జమాలరెడ్డి, ఎంపీడీఓ, నేలకొండపల్లి

ఇంటింటా వివరిస్తున్నాం..



ఉపాధి కూలీల ఇంటికి వెళ్లి ఇంటింటికి తిరిగి ఆధార్ అనుసంధానంలో ఉన్న ప్రయోజనాలను వివరిస్తున్నాం. తొలుత మందకొండిగా సాగిన.. ప్రస్తుతం అందరూ సహకరిస్తున్నారు. మరో మూడు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయించేందుకు కృషి చేస్తా.

– తిగుళ్ల భాస్కర్, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు, అనంతనగర్

నిధుల మళ్లింపుతోనే సర్పంచ్‌ల ఆత్మహత్యలు



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్, పక్కన రాయల

నేలకొండపల్లి: పంచాయతీలకు కేంద్రం అందించిన రూ.35 వేల కోట్ల నిధులను వేరే ఖాతాలకు బదిలీ చేసిన కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీలను అభివృద్ధి చేస్తాడా? అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన 15వ ఫైనాన్స్ నిధులను వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. నిధుల మళ్లింపుతో చేసిన పనులకు బిల్లులు రాక సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటుంటే కనిపించటం లేదా అని ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధిని ఇదేంటని ప్రశ్నించే ప్రధాన ప్రతిపక్షం నాయకులను అక్రమంగా అరెస్టులు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు తమ గోడును తెలిపేందుకు రాజకీయాలకు అతీతంగా నిరసన కార్యక్రమాలకు రావాలని సూచించారు. ప్రజా సమస్యలను గాలికొదిలి, అధికారం కోసం బీజేపీ, బీఆర్‌ఎస్‌లు పాకులాడుతున్నాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావటం ఖాయమని పేర్కొన్నారు. ధరల నియంత్రణతో పాటు ప్రతీ పేద కుటుంబానికి పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. వచ్చే నెల 6 నుంచి నిర్వహించనున్న హాత్‌సే హాత్‌జోడోను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, జిల్లా నాయకులు జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, కుక్కల హనుమంతరావు, దోసపాటి శేఖర్, లక్కం ఏడుకొండలు, మాగం సైదులు, తోళ్ల బుచ్చాలు, సూరేపల్లి రవి, శ్రీనాథ్, పగిడికత్తుల సుదర్శన్, వడ్డె జగన్, పొట్టపింజర రవి, సురేష్, విజయ్, దనుష్, తాతా అఖిల్, సుబ్బారావు, రిషికేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు కేటాయించాలి



మాట్లాడుతున్న చెరుకుపల్లి బాలు

ఖమ్మం మామిళ్లగూడెం: వంశ పారంపర్యంగా మృతదేహాలను అంత్యక్రియలు నిర్వహించే మాకు ఇళ్లు ఎవరూ అద్దెకు ఇవ్వడంలేదని ఆరోపిస్తూ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చి తమను ఆదుకోవాలని కాటికాపరి జాంబవంతుడు సొసైటీ ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి బాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని వైకుంఠదామాలలో పనిచేసేమేము కోవిడ్ సమయంలోనూ ప్రాణాలను పణంగా పెట్టి అంత్యక్రియలు నిర్వహించనట్లు పేర్కొన్నారు. తమను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి నెలకు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘ సమస్యలు తామే పరిష్కరించుకుంటామని, ఇతర పార్టీల నాయకులు కల్పించుకోకుండా సహకరించాలనికోరారు. ఈ సమావేశంలో పంది వేణు, వీరస్వామి, కాశయ్య, చుక్కయ్య, సైదులు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం

ఖమ్మంఅర్బన్: జిల్లాలోని దైవజనులందరూ ఐకమత్యంగా కలిసి మెలసి ఉండాలని పాస్టర్స్ ఫెలోషిప్ మహాసేన జిల్లా అధ్యక్షుడు మంద సంజీవరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం అర్బన్ పరిధిలోని సంఘం కార్యాలయంలో జరిగిన దైవజనుల సదస్సులో ఆయన మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంద తిమోతిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు చిన్ని డేవిడ్, కార్యదర్శి ఎల్. జీవరత్నం, పగిడిపల్లి కిరణ్, ఇమ్మానియేల్, బీమవరం జాన్ కెనడీ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీలు చేపట్టాలి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా చేపట్టేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్టా శ్రీనివాసరావు, కొమ్మినేని అనిల్‌కుమార్‌లు కోరారు. 2010, 2012, 2015లో రిజెక్ట్ చేసిన ఉపాధ్యాయులు కొత్త జిల్లాల ప్యానెల్ లిస్టులో చేర్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుందన్నారు. ఇలాంటి వారికి 2023లో పదోన్నతులకు అవకాశం కల్పించకుండా స్పష్టమైన ఆదేశాలివ్వాలని కోరారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

తిరుమలాయపాలెం: కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోసు పుల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తెట్టెలపాడులో ఫిబ్రవరి 1న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులకు ప్రమాద బీమా కింద రూ.10లక్షలు ఇవ్వాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొడుగు విజయ్, బింగి సురేష్, నర్సయ్య, నారాయణ, వెంకన్న, వెంకటేష్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

నివాళులు

తాతా నిఖిల్‌కు ఎంపీ నామా, మాజీ మంత్రి తుమ్మల..



నిఖిల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: ఇటీవల ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సోదరుడు విశ్వేశ్వరరావు కుమారుడు తాతా నిఖిల్ బెంగుళూరులో రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిఖిల్ చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు సాధు రమేష్‌రెడ్డి, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, రామసహాయం వెంకటరెడ్డి డీసీసీబీ డైరెక్టర్ చావా వేణుతో పాటు బాషబోయిన వీరన్న, బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

చామకూరి వెంకన్నకు తమ్మినేని..

పిండిప్రోలు గ్రామంలో ఇటీవల మృతిచెందిన చామకూరి వెంకన్నకు, తాతా నిఖిల్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మండల కార్యదర్శి కొమ్ము శ్రీను నాయకులు పద్మనాభుల సుధాకర్, తుల్లూరి నాగేశ్వరరావు, పప్పుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ సెంటర్‌లో ఒక బైక్ మెకానిక్ షాపులో 15 ఏళ్ల మైనర్ బాలుడిని పనిలో పెట్టుకున్నందుకు యజమాని రామలక్ష్మణ్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా బృందం నిర్వహించిన తనిఖీలో గుర్తించి యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డైరీల ఆవిష్కరణ



డైరీలను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌ఆర్ అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన రూపొందించిన నూతన సంవత్సర డైరీలను కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకులు ఎస్.గోపి, బి.రవికుమార్, రవీంద్రారెడ్డి, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మం మామిళ్లగూడెం: ముదిరాజ్ మహా సభ ఆధ్వర్యాన ముదిరాజ్‌ల సమస్యలపై రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముదిరాజుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్టల వెంకటనర్సయ్య, జిల్లా అధ్యక్షుడు రావుల హనుమంతరావు, అనంతరాములు, పిట్టల నాగేశ్వరావు, పతన వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు దోరేపల్లి శ్వేత, వెంకటేశ్వర్లు, మల్లేశ్, నర్ల శ్రీనివాసరావు, నర్ల శేషయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన మంత్రి..

ఖమ్మంఅర్బన్: నగరంలో టేకులపల్లిలో శుక్రవారం చిలకల వెంకటనరసయ్య కుమారుడు లక్ష్మీనారాయణ – కృష్ణవేణి దంపతులను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు ఆశీర్వదించారు. యాదవ సంఘం నేతలు పలువురు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర చట్టం తీసుకొచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసి సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వ్యవసాయ కార్మికులకు కనీస అవసరాలైన ఇళ్లు, ఇళ్ల స్థలాలు, విద్య, వైద్యం తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.శివలింగం, బండెల వెంకయ్య, లాజరు, కంకణాల అర్జున్‌రావు, ఆవుల మంగతాయి పాల్గొన్నారు.

గడువులోగా పూర్తి చేయాలి

కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి



ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేస్తున్న కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: గోళ్లపాడు ఛానల్ ఆధునికీకరణలో భాగంగా కాల్వపై చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దిష్ట సమయంలోగా పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం గోళ్లపాడు ఛానల్‌పై జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఇంజనీరింగ్ అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని, క్షేత్రస్థాయి సిబ్బందితో పనుల ప్రగతిపై సమీక్షించాలన్నారు. పనుల్లో నాణ్యత లోపించొద్దని, ప్రతీ పార్కును సుందరంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. కమిషనర్ వెంట డీఈలు, ఏఈలు ఉన్నారు.

నిర్మాణాల కూల్చివేతపై ఆందోళన..

నగరంలోని గోళ్లపాడు ఛానల్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా ప్రకాశ్‌నగర్ రోడ్డు నంబర్ 1లో అభివృద్ధి పనులను అధికారులు ప్రారంభించారు. ఈమేరకు రోడ్డు పక్కన ఉన్న ఇళ్ల తొలగింపుకు వేసిన మార్కింగ్ కంటే ఎక్కువ భాగం నిర్మాణాలను వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సైట్ ఇంజనీర్లు కూల్చుతున్నారని, దీనిని ఆపాలని అధికారులను ఆశ్రయించారు. శుక్రవారం ఉదయం అధికారులు వచ్చినా.. సిబ్బంది తమకేమి పట్టనట్లు నిర్మాణాలను కూల్చుతున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇక దీనిపై అధికారులను సంప్రదించగా.. మార్కింగ్ చేసిన వరకే నిర్మాణాలను తొలగిస్తున్నామని, ఎవరైనా తమ నిర్మాణాలను కోల్పోతున్నామని ఆందోళన చెందితే దీనిపై అధికారులను సంప్రదించవచ్చన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యాన ధర్నా



నూతన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రైవేట్ ఆస్పత్రుల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యాన నూతన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఉపేంద్ర సాహూ మాట్లాడుతూ.. రోగుల అవసరాలను ఆసరాగా చేసుకొని ప్రైవేట్ ఆస్పత్రులు చేస్తున్న అధిక ఫీజుల దందాను అరికట్టాలని, అనుమతులు లేని ఆస్పత్రులను సీజ్ చేసి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని తెలపారు. వైద్యరంగాన్ని వ్యాపారంగా మలుచుకొని రోగులను దోచుకుంటున్నారని అన్నారు. ఈ ధర్నాలో నాయకులు నాగేశ్వరావు, నాగరాజు, ఉపేందర్, విజయ్, మంజుల, శ్రీకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: పాలేరులోని జవహర్ నవోదయ పాఠశాలలో విద్యార్థుల అస్వస్థతకు కారణమైన ఫుడ్ పాయిజన్ ఘటనపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికల రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్‌తో పాటు జయేందర్, ధర్మవరపు యువరాజు, తుప్పతి కౌశిక్, బండి సాయి, గోపి, నరేష్ పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడిపై దాడి

ఖమ్మంరూరల్: ఏదులాపురంకు చెందిన ఓ సీపీఎం నాయకుడిపై దాడి జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ జరుగగా గ్రామానికి చెందిన వి.సుదర్శన్‌రెడ్డిపై రావడంతో అదే గ్రామానికి చెందిన చెరుకుపల్లి భాస్కర్, గణపారపు ఉపేందర్‌లు నువ్వెందుకు వచ్చావంటూ దూషిస్తూ దాడి చేశారు. సుదర్శన్‌రెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సీపీఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ మాట్లాడుతూ.. సుదర్శన్‌రెడ్డిపై ఎలాంటి దాడి చేయలేదని తెలిపారు.

బోదులబండ 'కంటి వెలుగు'కు విశేష స్పందన

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ కంటి వెలుగు కేంద్రానికి శుక్రవారం విశేష స్పందన లభిస్తుంది. ఈ కంటి వెలుగు కేంద్రాన్ని ఎంపీడీఓ కె.జమలారెడ్డి సందర్శించి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. వికలాంగులను సైతం దగ్గరుండి మరీ తీసుకొచ్చి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు అందించటంతో రోజుకు 160 నుంచి 180 వరకు వస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం నాడు నేలకొండపల్లిలో 167 మందికి, బోదులబండలో 173 మందికి పరీక్షలు నిర్వహించి జిల్లాలోనే ఆదర్శంగా నిలిచారని అభిప్రాయపడ్డారు. ఈమేరకు వైద్యాధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. మరింత మందిని పెంచి ప్రభుత్వం లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధాకృష్ణ, పీహెచ్ఎన్ కర్నాటి వాణి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.మణిబాబు, పీహెచ్ఎన్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

లీకేజీలతో నీరు వృథా..!



మండలంలోని పాలేరు నుంచి నర్సింహుల గూడెం వెళ్లే దారిలో రైతులు తమ పొలాలకు వేసుకున్న సాగునీటి పైపులైన్లు అక్కడక్కడ పగిలి నీరు వృథాగా పోతుంది. ఈ రహదారిపై మట్టి లోడుతో భారీ లారీల రాకపోకలతో రహదారి ధ్వంసం అవుతుండడంతో పాటు భారీ గుంతలు ఏర్పడి పైపులు పగిలి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

– కూసుమంచి

ప్రశ్నించాల్సిన అధికారి : దేవేందర్, ఆర్‌అండ్‌బీ జేఈ
సెల్ నంబర్ : 97019 13939